క్లుప్తంగా

నేటి నుంచి కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు

ఖమ్మంరూరల్ : మండలంలోని నాయుడుపేటలో గల కరుణగిరి చర్చిలో గురువారం నుంచి మార్చి 2 వరకు కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చర్చి డైరెక్టర్, ఫాదర్ మాథ్యూ వరప్రసాద్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న ఖమ్మం ఆర్‌సీఎం మేత్రాసనం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ పతాకావిష్కరణ చేసి దివ్యబలి పూజతో మహోత్సవాలను ప్రారంభిస్తారన్నారు. కరుణామయుని రథంతో ప్రదక్షిణ ఉంటుందని, చివరి రోజు కర్నూలు పీఠకాపరి డీడీ గోరంట్ల జ్యానేష్ ఆధ్వర్యాన పండుగ, సమిష్టి దివ్య బలిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైద్యుడికి న్యూరాలజీ సీటు



సీటు సాధించిన మయూర్

ఖమ్మంవైద్యవిభాగం : కేంద్ర ప్రభుత్వం ఐఎన్ఐసీఈటీ ఎస్ఎస్– 2025 విద్యా సంవత్సరానికి గాను ఇటీవల నిర్వహించిన సూపర్ స్పెషాలిటీ వైద్య ప్రవేశ పరీక్షలో ఖమ్మం నగరానికి చెందిన వైద్యుడు డి.మయూర్ ఓపెన్ కేటగిరీలో సీటు సాధించారు. కేరళలోని తిరువనంతపురం శ్రీ చిత్ర తిరుణాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో(ఎస్‌సీటీఐఎంఎస్) డీఎం న్యూరాలజీ విభాగంలో సీటు సాధించారు. వీరి కుటుంబంలో పలువురు డాక్టర్లుగా రాణిస్తుండగా.. మయూర్ తండ్రి డాక్టర్ హనుమాన్‌సింగ్ ఖమ్మం బోధనాస్పత్రిలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమేరకు బుధవారం మయూర్‌ను ఐఎంఏకు చెందిన సీనియర్ వైద్యులు, ప్రముఖులు అభినందించారు.

‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఫాసిస్టు కార్పొరేట్, మతోన్మాద విధానాలను వ్యతిరేకంగా ఈ నెల 28న ఢిల్లీలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని మాజీ సర్పంచ్ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా నాయకుడు కూసు అప్పారావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి మతోన్మాద విధానాలతో ముందుకుపోతున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు గుణపాఠం చెప్పేందుకు, ఢిల్లీలో జరిగే సదస్సుకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, ఆరెంపుల వెంకన్న, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఉన్నం నరేష్, పమ్మి జగదీష్, నాగేశ్వరరావు, తిమ్మిడి రఘుబాబు, గోకినపల్లి సైదులు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు సమీపాన పాపాయిగూడెం స్టేజీ వద్ద బుధవారం సాయంత్రం లారీ బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. మరిపెడ బంగ్లా నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న లారీ పాపాయిగూడెం క్రాస్ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద అతివేగంగా వచ్చిన ఓ లారీ కారును మరో లారీని ఢీ కొట్టి పల్టీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఎవ్వరికి ప్రమాదం జరగలేదు. లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు కడారు వెంకటేశ్వరరావు తన సతీమణి హైమావతి జ్ఞాపకార్థం స్థానిక శ్రీకంఠమహేశ్వరస్వామి దేవాలయం వద్ద బుధవారం బోరు ఏర్పాటుకు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా బోరు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ పోలంపల్లి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు రేణుబాబు, రమేష్, సైదులు, నాగేశ్వరరావు, వీరబాబు, నారాయణ, వీరస్వామి, పూజారి ప్రసాద్‌శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మనువాదులపై రాజీలేని పోరాటాలు

నేలకొండపల్లి: మనువాదులపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని కేవీపీఎస్ పాలేరు డివిజన్ అధ్యక్షుడు పగిడికత్తుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే లక్ష్యాలతో కేవీపీఎస్ ఆవిర్భవించిందని అన్నారు. దళితుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించామన్నారు. ప్రైవేట్ రంగాల్లోనూ కుల వివక్షత లేకుండా ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పొట్టపింజర స్టాలిన్, పెద్దపాక మల్లేశ్వరరావు, పుణ్యావతి, పద్మ, బొడ్డు మధు, వీరస్వామి, కళ్యాణ్, వెంకటేష్, రేణు, రాము, ఎల్లయ్య, శ్రీను, నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



శంభో.. శంకర..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తజన సంద్రమయ్యాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు బారులుదీరి మహాశివున్ని దర్శించుకున్నారు. కొందరు భక్తులు ఉపవాసం, రాత్రంతా జాగరణ చేశారు. రాత్రి స్వామి వారికి కళ్యాణ మహోత్సవం, లింగోద్భవకాలాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన మజ్జిగ, పులిహోర, తాగునీరు, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. – సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: గణపేశ్వరాలయంలో స్వామివారికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి



ఖమ్మం: గుంటు మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దంపతులు



తీర్థాల సంగమేశ్వరస్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



తిరుమలాయపాలెం: సుబ్లేడులోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలోని శివలింగం



గుంటు మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న ఖమ్మం కోర్టు న్యాయమూర్తులు



ఖమ్మం: సుగ్గలవారి తోటలో శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మేయర్ నీరజ కుటుంబీకులు



కామేపల్లి: శ్రీ బాలాత్రిపుర సుందరి ఇష్టకామేశ్వరి స్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకాలు



ఖమ్మంరూరల్: తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయంలో పుట్ట వద్ద భక్తుల సందడి



తీర్థాల సంగమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి



తీర్థాలలో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



మున్నేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



ఖమ్మంలోని గుంటుమల్లేశ్వర స్వామి దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఖమ్మంరూరల్: తీర్థాల సంగమేశ్వరస్వామికి పూజలు చేసి జాతరను ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాంప్రసాద్



తీర్థాల జాతరకు వచ్చి చెట్ల కింద సేదదీరుతున్న భక్తులు



తీర్థాల జాతరలో భక్తులకు జ్యూస్ అందజేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు



నేలకొండపల్లిలో పులిహోర పంపిణీ చేస్తున్న యువత



తీర్థాల జాతరకు వంట సామగ్రితో వస్తున్న భక్తులు

శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలకు పూజలు



పూజలు అందుకున్న సీతారాముల ఉత్సవ విగ్రహాలు

కామేపల్లి: భద్రాచలం దేవస్థానానికి చెందిన ప్రధాన అర్చకుడు శ్రీరామస్వరూప్ ఆధ్వర్యాన లక్ష్మణ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి ఉత్సవ విగ్రహాలను కామేపల్లిలోని శ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి మందిరానికి బుధవారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామ పొలిమేర నుంచి భజనలు, కోలాట నృత్య ప్రదర్శనలతో స్వాగతం పలికారు. మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారాములను దర్శించుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి వివాహ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని గ్రామంలో ఊరేగించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పండ్లు పంపిణీ



పండ్లు, టూత్ పేస్ట్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా డాబర్ కంపెనీ సహకారంతో వాసవీ క్లబ్, శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యాన బుధవారం బ్రాహ్మణ బజార్‌లో భక్తులకు అరటి పండ్లు, పుల్లఖండం సుమన్ ఆధ్వర్యాన డాబర్ టూత్ పేస్టులు పంపిణీ చేశారు. జోన్ చైర్మన్ మోహన్‌దాస్, క్లబ్ అధ్యక్షుడు శ్రీహరి, కార్యదర్శి భద్రయ్య, కోశాధికారి యుగంధర్, శ్రీకాంత్, సుబ్బారావు, ఫణికుమార్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కొట్లాడే అభ్యర్థిని గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నేలకొండపల్లి: ఉపాధ్యాయుల సమస్యలపై కొట్లాడే సత్తా ఉన్న పులి సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కోరారు. మండలంలోని కొత్త కొత్తూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని బలపరిచిన పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలన్నారు. 317 జీఓ ద్వారా ఉపాధ్యాయుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని పేర్కొన్నారు. పెద్దల సభలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలదీసేందుకు బీజేపీకి అవకాశం ఇవ్వాలన్నారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థిని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒక్కటయ్యాయని ఆరోపించారు. మండలిలో సమస్యలపై పోరాడే సరోత్తంరెడ్డి కావాలో గెలిచి కాంగ్రెస్ గూటికి చేరే వారు కావాలో ఆలోచించాలని అన్నారు. ముసుగుతో వస్తున్న వారి పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేకా సంతోష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మెహినుద్దీన్, కళ్యాణం నాగేశ్వరరావు, నాగచారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు వెళ్తుండగా ప్రమాదం..

- ఇద్దరు యువకులకు గాయాలు

కామేపల్లి: స్కూటీని ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు కథనం ప్రకారం.. ఏన్కూర్ మండలం కేసుపల్లికి చెందిన గుగులోత్ సాయికుమార్, బానోత్ విష్ణు కేసుపల్లి నుంచి స్కూటీపై పండితాపురం గ్రామం మీదుగా తీర్థాల జాతరకు వెళ్తున్నారు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో స్కూటీని ఢీకొనడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మంకు తరలించారు.

పేదల పక్షపాతి కాసాని ఐలయ్య



నినాదాలు చేస్తున్న తమ్మినేని, పార్టీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రాణం పోయేంతవరకు ప్రజల కోసమే పోరాడిన కాసాని ఐలయ్య పేద ప్రజల పక్షపాతి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇటీవల మరణించిన సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య సంస్మరణ సభ ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు కూలీల, కార్మికుల, వృత్తిదారుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలకు ఐలయ్య నాయకత్వం వహించాడన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఐలయ్య చిత్రపటానికి తమ్మినేని పూలమాల వేయగా, నాయకులంతా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, కల్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బొంతు రాంబాబు, బండి పద్మ, శ్రీనివాసరావు, మాదినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు



నేలకొండపల్లి పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది

నేలకొండపల్లి: వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. బుధవారం అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో మొత్తం 55 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీ బందోబస్తు

ఖమ్మంక్రైం: నేడు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యాన పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు చేపట్టనుండగా.. 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ప్రజలు ఐదుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండొద్దని, ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లఘించినా, అతిక్రమించినా, చట్ట వ్యతిరేఖంగా ప్రవర్తించినా చట్టపరంగా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు సిద్ధం చేసినందున పోలింగ్ కేంద్రాలకు కిలోమీటర్ దూరం వరకు ఆత్మరక్షణ పేరుతో కర్రలు, తుపాకులు, మారణాయుధాలతో సంచరించడం నిషేధం అన్నారు.

ప్రాతినిధ్యంలేని కులాలకే ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఖమ్మంవన్‌టౌన్: చట్టసభల్లో ప్రాతినిధ్యం లేని కులాలకు మాత్రమే ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని టీపీసీసీ మాజీ కార్యదర్శి, మాదిగ సామాజిక వర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ ఓ ప్రకటనలో కోరారు. ఖమ్మంలో ఓసీ సామాజిక వర్గం, ఎస్టీలు ప్రజాప్రతినిధులుగా ఉన్నారని, ఎస్సీ మాదిగ, బీసీలోని 56 కులాల్లో ఎవరికీ ప్రాతినిధ్యం లేదన్నారు. జిల్లాలో మాదిగలు 18 శాతం, బీసీ 60శాతం ఉన్నారని, గెలుపు ఓటములు ప్రభావితం చేసేస్థాయిలో ఉన్నారన్నారు. పార్టీలోనే ఉండి కష్టపడి పనిచేసిన వారికి ఎమ్మెల్సీ కేటాయించి ఈ వర్గాలకు న్యాయం చేయాలన్నారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఢిల్లీలోని రాహుల్‌గాంధీ తదితరులను కలుస్తామని అన్నారు.

వ్యథసాయం..!


- రైతుల కంట్లో దుమ్ము కొడుతున్న వ్యర్థాలు
- ఫ్యాక్టరీ డస్ట్‌తో కూలీలు రాని వైనం
- మూగజీవాలకు సైతం తప్పని తిప్పలు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

అవి ఒకప్పుడు పచ్చటి పొలాలు.. వివిధ పంటలతో రైతులు సంతోషంగా ఉండేరోజులవి. కళ్లలో ఆనందమే నిండుగా ఉండే వారి కళ్లలో ప్రస్తుతం దుమ్ము కొడుతున్నారు. ఫ్యాక్టరీ వెదజల్లే డస్ట్‌తో వ్యవసాయం చేయలేని దుస్థితి నెలకొంది. అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం కనిపించటం లేదని అన్నదాతలు వాపోతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుంటే తప్ప వ్యవసాయం చేయలేమని రైతులు తేల్చి చెబుతున్నారు.



దుమ్ముతో కూడిన మిర్చి తోటను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురం సరిహద్దు గ్రామం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరిహద్దు గ్రామాల మధ్య ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ ప్రస్తుతం రైతులకు శాపంగా మారింది. ఫ్యాక్టరీ నుంచి వచ్చే డస్ట్‌తో దాని పక్కనే ఉన్న దాదాపు 500 ఎకరాల్లోని మిరప, పత్తి, వరి, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. అంతేకాక ఆ పరిసర ప్రాంతాల్లోని నీటి గుంటలు సైతం కలుషితమై వాటిని తిగిన మూగజీవాలు అనారోగ్యం బారిన పడుతున్నాయి. దాదాపు 2 కిలో మీటర్ల వరకు ఉన్న రైతుల పొలాల్లో ఈ పరిస్థితి దాపురించింది. గ్రామంలో ఉన్న చెరువులో ఫ్యాక్టరీకి చెందిన డస్ట్ పడడంతో చెరువులోని నీరు రంగు మారి వాటిని వాడేందుకు రైతులు, ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. ప్రజలకు వివిధ రోగాల బారిన పడుతున్నారు.



దుమ్మును చూపిస్తున్న మహిళా రైతులు(ఫైల్)

కంట్లో కారం కొట్టినట్టే..

ఏపీలోని జగ్గయ్యపేటకు ఈ ఫ్యాక్టరీ రహదారి నుంచే వెళ్తుంటారు. ఈ సమయాన ఫ్యాక్టరీ నుంచి వచ్చే డస్ట్ రైతుల కళ్లలో పడి మంటలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీకి చెందిన అడవి చాలా వరకు ఫ్యాక్టరీకి అనుకుని ఉండడంతో అందులోని జీవచరాలు ఫ్యాక్టరీ వలన వచ్చే వ్యర్థాలతో అవి మృత్యువాత పడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దీని చుట్టుపక్కల పండిన పంటలు డస్ట్‌తో నిండి ఉండడంతో కూలీలు సైతం రావడం లేదు. ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు ఆందోళన చేపట్టడంతో పాటు కలెక్టరేట్‌లో ఎదుట నిరసన చేపట్టి వినతి పత్రాలు సైతం అందించారు. దీంతో ఆయా పంటలను అధికారులు పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించిన ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధిత రైతులు మండిపడుతున్నారు.

కూలీలు రావడం లేదు.



ఫ్యాక్టరీ సమీపంలో మిర్చి నాలుగు ఎకరాలు, పత్తి నాలుగు ఎకరాలు, వరి రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా. ఫ్యాక్టరీతో వచ్చే డస్ట్‌తో పంటంతా దుమ్ముతో నిండి ఉంది. కూలీలు కూడ రావడం లేదు. వ్యవసాయం చేయలేని పరిస్థితిలో ఉన్నాం. అధికారులు తమ గోడును అర్థం చేసుకుని చర్యలు తీసుకోవాలి. – శీలం వెంకటేశ్వర్లు, బాధిత రైతు, అప్పలనరసింహాపురం

పంటలు కాపాడాలి..



ఫ్యాక్టరీతో వచ్చే డస్ట్, వ్యర్థాలతో రైతుల పంటలు దెబ్బతింటున్నాయి. రైతులు పలుమార్లు ఆందోళనలు చేసినా తగిన చర్యలు తీసుకోవడం లేదు. రైతులు సాగు చేసిన పంటలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. రైతుల బాధలు క్షేత్ర స్థాయిలో పరిశీలించినా నేటికీ చర్యలు తీసుకోకపోవడం సరికాదు. – ఏపూరి రామారావు, బాధిత రైతు, అప్పలనరసింహాపురం

కలెక్టర్ పట్టించుకోవాలి..



అప్పలనరసింహాపురంలో ఫ్యాక్టరీతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు అడిగినా పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగితే తప్ప సమస్య పరిష్కారం కాదు. కావునా రైతులను ఆదుకునేందుకు ఇప్పటికై నా కలెక్టర్ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – రచ్చా నరసింహారావు, రైతు సంఘం నాయకుడు, నేలకొండపల్లి